# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దుబాయ్ లో పర్యటిస్తున్నారు.
- ❖ మున్సిపాలిటీల ఆధునికీకరణకు 4 వేల కోట్ల రూపాయలతో ఒక పథకాన్ని అమలు చేయనున్నామని మంత్రి పి. నారాయణ తెలిపారు.
- ❖ విశాఖపట్టణం భవిష్యత్ లో దేశ ఏఐ రాజధాని కాబోతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ లో రొయ్యలు, చేపల పెంపకం సామర్థ్యాన్ని పెంచేందుకు సహకరించాలని ఆక్వా రంగ నిపుణులను మంత్రి నారా లోకేశ్ కోరారు.
- ❖ దక్షిణ కోస్తాంధ్రలోని పలు జిల్లాలలో రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

====================

ఆంధ్రప్రదేశ్-యూఏఈ మధ్య పారిశ్రామిక బంధం బలపడేలా సహకరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దుబాయిలోని భారత రాయబార కార్యాలయం ప్రతినిధులను కోరారు. పెట్టుబడుల సాధనకు, నవంబర్ నెలలో జరిగే భాగస్వామ్య సదస్సుకు ఆహ్వానాలు పలికేందుకు యూఏఈలో మూడు రోజుల పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి ఈరోజు దుబాయ్ చేరుకున్నారు. ఈ సందర్భంగా దుబాయ్ లో భారత రాయబార కార్యాలయం ప్రతినిధులతో సమావేశమయ్యారు. యూఏఈలోని వివిధ కంపెనీల వివరాలు, ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ఏయే రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అనువుగా ఉంటుందనే అంశాలపై వారితో చర్చించారు. నౌకా నిర్మాణం నుంచి డేటా సెంటర్ల వరకు ఆంధ్రప్రదేశ్ లో అపారమైన అవకాశాలు ఉన్నాయని వారికి తెలిపారు.

====================

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల ఆధునికీకరణకు 4 వేల కోట్ల రూపాయల వ్యయంతో ఒక పథకాన్ని అమలు చేయనున్నామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. మొదటి విడతలో భాగంగా 77 మున్సిపాలిటీల పనులను త్వరలోనే ప్రారంభిస్తామని వెల్లడించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని దగదర్తి వద్ద విమానాశ్రయ నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. క్యాబినెట్ ఆమోదం పొందిన తర్వాత పనులు మొదలవుతాయన్నారు. భవనాలు, లేఔట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (LRS), బిల్డింగ్ పేనలైజేషన్ స్కీమ్ (BPS)లను ఉపయోగించుకోవాలని మంత్రి సూచించారు.

====================

ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి కేంద్రప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తెలిపారు. విజయవాడలో ఈరోజు జరిగిన బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశానికి వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ… విశాఖపట్టణానికి గూగుల్ సంస్థ రావటం శుభపరిణామమన్నారు. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వాల కృషి వల్లే ఇది సాధ్యమయ్యిందన్నారు. విశాఖపట్టణం భవిష్యత్ లో దేశ ఏఐ రాజధాని కాబోతుందని పీవీఎన్ మాధవ్ పేర్కొంటూ…

(వాయిస్ 30 సెకన్లు)

====================

దసరా, దీపావళి, ఛట్ పూజ పండుగల సందర్భంగా ఈ నెల రోజుల్లో దేశవ్యాప్తంగా 12 వేల ప్రత్యేక రైళ్లను నడిపినట్లు విజయవాడ రైల్వే డివిజన్ మేనేజర్ మోహిత్ సోనాకియా తెలిపారు. విజయవాడలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ… పండుగల వేళ ప్రయాణీకుల సంఖ్య భారీగా పెరిగిన నేపథ్యంలో.. అందుకు తగిన విధంగా భారతీయ రైల్వే విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు. గతేడాది ఈ సమయంలో నడిపిన 7 వేల 724 రైళ్లతో పోలిస్తే ఈ సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. పండుగల రద్దీలో ప్రయాణీకులకు సజావుగా, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడం కోసం భారతీయ రైల్వే పూర్తి శక్తి సామర్థ్యాలతో పని చేసిందన్నారు.

విరామం

====================

ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా జేమ్స్ కుక్ యూనివర్సిటీలో సెంటర్ ఫర్ సస్టైనబుల్ ట్రోఫికల్ ఫిషరీస్ అండ్ అక్వాకల్చర్ (CSTFA) విభాగం ప్రొఫెసర్ క్యాల్ జెంజర్ తో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఈరోజు సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్ లో రొయ్యలు, చేపల పెంపకం సామర్థ్యాన్ని పెంచేందుకు సీఎస్ టీఎఫ్ఏ ద్వారా ఆక్వాకల్చర్ జెనెటిక్స్ నైపుణ్యాలను అందించడం, బ్లాక్ టైగర్ రొయ్యలతో భారత్ లో ప్రధానంగా ఉత్పత్తి చేసే ఆక్వా రకాల్లో వ్యాధి నిరోధకత, వృద్ధిరేటు కోసం జన్యుపరమైన మెరుగుదలకు కృషి చేయాలని ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ ఆయనను కోరారు. ఆధునిక ఆక్వాసాగు పద్ధతులు, జన్యుపరమైన ఎంపిక, స్థిరమైన నిర్వహణ పద్ధతులపై ఆంధ్రప్రదేశ్ ఆక్వా రైతుల కోసం శిక్షణా కార్యక్రమాలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపిక చేసిన బ్రీడ్ల ద్వారా ఉత్పాదకత పెంపుదలకు ప్రొఫెసర్ జెంజర్ అభివృద్ధి చేసిన జెనెటిక్ టూల్స్ ను తమ ఆక్వా రైతులకు అందించాలన్నారు.

====================

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 31 నుండి నవంబర్ 25వ తేదీ వరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ``రన్ ఫర్ యూనిటీ`` ర్యాలీలను నిర్వహిస్తున్నామని నెహ్రూ యువ కేంద్ర రాష్ట్ర డైరెక్టర్ అన్షుమాన్ ప్రసాద్ దాస్ తెలిపారు. విజయవాడలో ఆయన ఈరోజు ఆకాశవాణితో మాట్లాడుతూ.. ఈ ర్యాలీలను అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోనూ నిర్వహిస్తామని చెప్పారు.

ముందస్తు కార్యక్రమాల్లో భాగంగా ఆరోగ్య శిబిరాలు, సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితంపై ప్రసంగాలు, మాదక ద్రవ్యాల రహిత భారతదేశంపై ప్రతిజ్ఞలు మొదలగు కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్షుమాన్ ప్రసాద్ దాస్ వెల్లడిస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

====================

నైరుతి బంగాళాఖాతంలోని నిన్నటి అల్పపీడనం వాయువ్య దిశగా కదులుతూ మరికొన్ని గంటల్లో పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇక రేపటి ఉదయానికి ఇది ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాల మీదుగా కదిలే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ఫలితంగా రేపు దక్షిణ కోస్తాంధ్రలోని పలు జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎస్. కరుణా సాగర్ తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో తిరుపతిలో 'స్వచ్ఛోత్సవ్' కార్యక్రమాన్ని ఈరోజు ఘనంగా నిర్వహించారు. తిరుపతిలోని భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ (IISER)లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి `స్వచ్ఛతా హీ సేవ 2025` కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో సీబీసీ సహాయ సంచాలకులు ఆర్. రమేష్ చంద్ర మాట్లాడుతూ.. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొనే పారిశుధ్య నిర్వహణ సవాళ్లకు IISER విద్యార్థులు, శాస్త్రవేత్తలు వినూత్న పరిష్కారాలు కనుగొనాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న పట్టణీకరణ, మారుతున్న ప్రజా అలవాట్లతో దేశం ఎదుర్కొనే పారిశుధ్య, పర్యావరణ సమస్యల పరిష్కారమే మానవాళి మనుగడకు కీలకమని ఆయన తెలిపారు.

====================
====================